## క్లుప్తంగా

### ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థిని నవ్య ఎంపిక



వెదురుకుప్పం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు వెదురుకుప్పం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నలిపిరెడ్డి నవ్య ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎంలు వెంకటరమణారెడ్డి తెలిపారు. శని వారం పాఠశాలలో నవ్యను అభినందించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఏటా పాఠశాల నుంచి విద్యార్థులు జాతీయ స్కాల ర్‌షిప్‌కు ఎంపికవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో అన్ని రంగాల్లోనూ రాణిస్తూ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా పంపిణీ బహిరంగ సమావేశంలో మంత్రి ఆర్కేరోజా పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 14,468 మంది లబ్ధిదారులు రూ.15.50 కోట్ల మేర లబ్ధిని అందుకోనున్నారు. మున్సిపల్ అధికారులు, జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, ఎంపీడీఓల ఆధ్వర్యంలో సమావేశం జరగనుంది. అలాగే సాయంత్రం 3 గంటలకు విజయపురం మండలం ఎంపీడీఓ కార్యాలయంలో పొదుపు సంఘాలకు వైఎస్సార్ ఆసరా మూడవ విడత మెగా చెక్కును అందజేస్తారు.

### విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

వెదురుకుప్పం: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. శనివారం మండలంలోని పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూల్‌లో వార్షికోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ద్వారా ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశం ఉందన్నారు. సమాజాభివృద్ధికి విద్యే అత్యంత కీలకమన్నారు. చివరిగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

### మంచి ఫలితాలు సాధించండి



రాగిజావ పంపిణీ చేస్తున్న డీవైఈఓ రఘురామయ్య

పుత్తూరు రూరల్: ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఇటు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు డీవైఈఓ రఘురామయ్య దిశానిర్దేశం చేశారు. శనివారం మండలంలోని గోపాలకృష్ణాపురం, పిళ్లారిపట్టు, రాచపాళెం, గేట్‌పుత్తూరు ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. రాగిజావను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుమల రాజు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

### గృహ నిర్మాణాల పరిశీలన

నిండ్ర: మండలంలోని నిండ్ర, ఎలకాటూరు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న గృహనిర్మాణ పనులను హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసేలా చూడాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్ బాబురెడ్డి, చంద్రబాబు పాల్గొన్నారు.


### వందశాతం వ్యాక్సినేషన్ పూర్తి చేయండి



తనిఖీ చేస్తున్న డీఅండ్‌హెచ్ఓ ప్రకాశం

గంగాధరనెల్లూరు: నూటికి నూరుశాతం వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జిల్లా ఆరోగ్యవైద్యాధికారి డాక్టర్ ప్రకాశం ఆదేశించారు. మండలంలోని పద్మాపురం పంచాయతీ కొండేపల్లిలో వైద్యసిబ్బంది చేపట్టిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాక్సినేషన్ ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం వ్యాక్సిన్ వేయడం ద్వారా చిన్నపిల్లల్లో 13 రకాల రోగాలు రాకుండా కాపాడుకునేందుకు వీలుంటుందన్నారు. వచ్చే ఎండాకాలంలో వడదెబ్బ సోకే అవకాశం ఎక్కువగా ఉందన్నారు.

### ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పుల్లారెడ్డి



కార్వేటినగరం: కార్వేటినగరం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పుల్లారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. వెదురుకుప్పం తహసీల్దార్‌గా ఉన్న ఈయనను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్వేటినగరం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించారు. ఇక్కడ శ్రీరంగరాజపురం తహసీల్దార్ షబ్బీర్‌బాషా ఇన్‌చార్జ్‌గా వ్యవహరించేవారు. అయితే ఇటీవల ఓ రైతు వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీటీ.లక్ష్మీపతి, సిబ్బంది ఉన్నారు.

# రాగిజావ.. పోషకాల నావ

- జగనన్న గోరుముద్దలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ
- విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం అందించాలన్నదే సర్కారు లక్ష్యం
- వారంలో మూడురోజుల పాటు పంపిణీ

రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ప్రభుత్వ స్కూళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా నాణ్యమైన భోజనం అందేలా చర్యలు చేపట్టారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా స్కూళ్లలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నారు. ఇప్పుడు తాజాగా విద్యార్థులకు రాగిజావ అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.



బలిజకండ్రిగ హైస్కూల్‌లో రాగిజావ తాగుతున్న విద్యార్థులు

| మండలం | పాఠశాలలు | విద్యార్థులు | మండలం | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|---|---|---|
| గంగాధరనెల్లూరు | 102 | 3806 | శ్రీరంగరాజపురం | 64 | 2893 |
| కార్వేటినగరం | 79 | 4600 | వెదురుకుప్పం | 81 | 4257 |
| పెనుమూరు | 63 | 2519 | పాలసముద్రం | 34 | 1760 |

పాలసముద్రం: ప్రభుత్వ స్కూళ్లలో విద్యను అభ్యసించే విద్యార్థులకు సంపూర్ణ పోషకాహారం అందించాలన్న ఉద్దేశంతో ఇప్పటికే జగనన్న గోరుముద్ద పథకం అమలు చేస్తున్న విషయం విదితమే. అయితే ఎండాకాలంలో విద్యార్థులకు పోషకాలు ఉన్న ఆహారం అందించడానికి శ్రీకారం చుట్టింది. తాజాగా జగనన్న గోరుముద్ద మెనూలో విద్యార్థులకు రాగిజావను అందించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించగా, విద్యాశాఖ అధికారులు ఆ దిశగా ముందుకు వెళ్తున్నారు. మెనూలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ విద్యార్థులకు మరిన్ని పోషకాలతో కూడిన ఆహారం అందిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం అందిస్తున్న ఆహార పదార్థాలతో పాటు మంగళవారం, గురు, శనివారాల్లో రాగిజావ అందించాలని నిర్ణయించింది. ఈ పథకం అమలుకు అవసరమయ్యే బెల్లం, రాగి పిండి పౌర సరఫరాల శాఖ నుంచి రేషన్ షాపుల ద్వారా పాఠశాలలకు అందిస్తారు. రాగిజావ తయారీపై ప్రభుత్వం వీడియో సైతం విడుదల చేసింది. ఉదయం 8.30 గంటలకు విద్యార్థులకు రాగిజావ అందించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 423 ప్రభుత్వ స్కూళ్లు ఉన్నాయి. అందులో 19,835 మంది విద్యార్థులు రాగిజావ సేవించనున్నారు.

**ప్రస్తుత మెనూ..**

సోమవారం వెజ్ పలావు, గుడ్డు కూర, చిక్కీ, మంగళవారం రాగిజావ, పులిహోర, చట్నీ, గుడ్డు, బుధవారం వెజ్ బిర్యానీ, బంగాళాదుంప, కోడిగుడ్డు, చిక్కీ, గురువారం రాగిజావ, లెమన్ రైస్, టమాట చట్నీ, గుడ్డు అందిస్తున్నారు. శుక్రవారం అన్నం, పప్పు, గుడ్డు చిక్కీ, శనివారం రాగిజావతో పాటు ఆకుకూర అన్నం, స్వీట్ పొంగల్ పెడుతున్నారు.



తయారు చేసిన రాగిజావ

**అన్ని స్కూళ్లలో అమలు**



అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థులకు మంగళవారం, గురువారం, శనివారం రాగిజావ అందించేందుకు చర్యలు చేపట్టాం. మధ్యాహ్న భోజన నిర్వాహకులు రాగిజావ తయారు చేసి విద్యార్థులకు అందించాలి.

– రాజేంద్రప్రసాద్, ఎంఈఓ

**పోషకాలు అధికం..**



వేరుశనగ, నువ్వులు, ఆకుకూరలు, గుడ్డుతోపాటు రాగిపిండిలో క్యాల్షియం పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలు దృఢత్వానికి, బలాన్ని అందించేందుకు తోడ్పడతాయి. పిల్లల్లో ఎదుగుదలతో పాటు వారిలోని రక్తహీనత నివారణకు ఉపయోగపడతాయి. వేసవిలో రాగిజావ వేడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

– మోహన్‌కృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి

### నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు వెదురుకుప్పంలో పర్యటిస్తారని ఎంపీడీఓ సుధాకరరావు తెలిపారు. శనివారం వెదురుకుప్పంలోని సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బంది తప్పకుండా హాజరుకావాలని సూచించారు. వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం మూడవ విడత అందజేస్తున్న నగదును మెగా చెక్కురూపంలో మంత్రి పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రతిఒక్కరూ ఆయా సచివాలయాల పరిధిలోని స్వయం సహాయక సంఘాలు, డ్వాక్రా మహిళలు, వివిధ అంశాలకు సంబంధించి నివేదికలను తీసుకురావాలని కోరారు.

### తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

పుత్తూరు రూరల్: పౌర్ణమిని పురస్కరించుకుని ఏప్రిల్ 5వ తేదీ ఉదయం 11 గంటలకు పుత్తూరు నుంచి, మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి నుంచి తిరువణ్ణామలైకి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుగు ప్రయాణంలో తిరువణ్ణామలై నుంచి పుత్తూరుకు ఉదయం 4 గంటలకు, తిరుపతికి ఉదయం 6 గంటలకు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## సమస్యలు పరిష్కరించండి



కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న చాంద్‌బాషా

పుత్తూరు రూరల్: సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా మాట్లాడుతూ సెకెండ్ ఫేజ్‌లో నియమితులైన సచివాలయ ఉద్యోగుల్లో అర్హత కలిగిన వారికి ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలని కోరారు. అన్ని సచివాలయాల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని, సచివాలయ క్లీనింగ్, స్వీపింగ్ చేసేందుకు ఒక వర్కర్‌ను డిప్యూటేషన్ వేయాలని విన్నవించారు. అలాగే అడ్మిన్ కార్యదర్శులపై ఉన్న రెవెన్యూ మినహా ఇతరత్రా అదనపు పనిభారాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో పుత్తూరు మండల కమిటీ అధ్యక్షురాలు సబిత, ప్రధాన కార్యదర్శి సౌమ్య, సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రసన్న వెంకన్న గ్రామోత్సవం



అభయహస్తం వేంకటేశ్వరుడి గ్రామోత్సవం

వడమాలపేట: మండలంలోని అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి తిరుచ్చి గ్రామోత్సవం, ఊంజల్‌సేవ శనివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించారు. అనంతరం వేదమంత్రాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ శ్రీవారికి ఊంజల్ సేవ నిర్వహించారు. సర్వ అలంకారభూషితడైన పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామిని మంగళవాయిద్యాలు నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తుల నారికేళ, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. రాత్రి స్వామి వారికి ఏకాంత సేవ నిర్వహించారు.

### నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థిక భరోసా కల్పిస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడతను లాంఛనంగా ఆదివారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ మోహన్‌మురళి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు మండల కార్యాలయ ఆవరణలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్ని లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తారన్నారు. అలాగే వెదురుకుప్పంలో మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో, పెనుమూరులో 4 గంటలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆయా మండలాల్లోని వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళా సంఘ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



రైతులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పాలసముద్రం: రైతన్నలు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో పాటు ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని ఏపీ పీఎస్ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు సమక్షంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు వాడిన కూరగాయలు, బియ్యం తీసుకోవడం వల్ల పలు రకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేసేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. పంటలు సాగు చేసిన తరువాత రోగాలు వస్తే, కషాయం తయారు చేసుకుని పిచికారీ చేయాలన్నారు. రైతులు సందేహం వస్తే వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన చెరుకు నుంచి తయారు చేసిన బెల్లంను తిరుమల–తిరుపతి వారు మార్కెట్ ధర కన్నా రూ.5 ఎక్కువగా తీసుకుంటారని తెలిపారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

## ఎన్నో వ్యాధులకు సమర్థవంతమైన చికిత్స

– స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ



డాక్టర్ వెంగమ్మను సత్కరిస్తున్న అధ్యాపక బృందం

పుత్తూరు రూరల్: మనదేశంలో గత 40 ఏళ్లలో సైన్స్ ఎంతగానో అభివృద్ధి చెందిందని, ఎన్నో వ్యాధులకు సమర్థవంతమైన చికిత్స అందించడం జరుగుతోందని స్విమ్స్ డైరెక్టర్, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బి.వెంగమ్మ అన్నారు. శనివారం పుత్తూరులోని కేకేసీ నర్సింగ్ కళాశాలలో పర్పుల్ డే సందర్భంగా మూర్ఛ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ మూర్ఛ వ్యాధికి చికిత్స లేదన్నది అపోహ మాత్రమేనని, మందులతో చికిత్స, సర్జరీ సైతం ఉందని తెలిపారు. ఇది అంటువ్యాధి కాదని స్పష్టం చేశారు. తొలిదశలోనే గుర్తించి మూడేళ్ల పాటు క్రమం తప్పకుండా చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమయ్యే అవకాశాలు అత్యధికమన్నారు. వంశపార్యపరంగా నాలుగు రకాల మూర్ఛ వ్యాధులు ఉండగా, మరో 95 రకాల మూర్ఛ వ్యాధులు ఉన్నాయన్నారు. అయితే వయసు ఆధారంగా మూర్ఛకు గల కారణాలను గుర్తించడం జరుగుతుందన్నారు. మూర్ఛ వ్యాధి నివారణకు క్రమం తప్పని చికిత్సతో పాటు మద్యపానం, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. అనంతరం డాక్టర్ వెంగమ్మను కళాశాల అధ్యాపక బృందం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కుప్పయ్యశెట్టి, వైస్ చైర్మన్ నరసింహారావు, ప్రిన్సిపల్ శరవణన్, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని హెచ్ఎం మనోహర్ నాయుడు శనివారం తెలిపారు. అందులో సాయిసుదర్శన్, తేజశ్విని, గుణసుందరి, తిరుమశరాజుపురం హైస్కూల్ విద్యార్థిని అభినయ ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కి ఎంపికయ్యారు. వీరిని ఉపాధ్యాయుల బృందం, గ్రామ పెద్దలు అభినందించారు.

### వెలుగు సీసీకి ఏడాది జైలు

వడమాలపేట: పొదుపు మహిళా సంఘాల నిధులు స్వాహా చేసిన వెలుగు సీసీ నాగేంద్రకు ఏడాది జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. అనంతపురానికి చెందిన నాగేంద్ర వడమాలపేట వెలుగు సీసీగా 2019 నుంచి విధులు నిర్వహించేవాడు. అయితే విధి నిర్వహణలో డ్వాక్రా నిధులు స్వాహా చేయడంతో అప్పట్లో కేసు నమోదైంది. విచారణలో నేరం రుజువు కావడంతో పుత్తూరు ఏడీఎం కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

### నేడు మండల మీట్

కార్వేటినగరం: మండల సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మోహన్‌మురళి తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ లత ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. మండలస్థాయి అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులపై పూర్తి నివేదికతో హాజరు కావాలని సూచించారు. అలాగే ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కూడా ముఖ్య అతిథిగా పాల్గొని మండల స్థాయి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

### ఘనంగా మహాకుంభాభిషేకం



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

నిండ్ర: మండలంలోని నెట్టేరి గ్రామంలో నూతనంగా నిర్మించిన రాముల వారి ఆలయంలో శనివారం మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఆలయం వద్ద గణపతి పూజ, కలశపూజలు చేపట్టారు. ప్రముఖ జ్యోతిష్యులు ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో పూజలు చేపట్టి, ఆలయ గోపురంపై పరిశుద్ధ జలాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

### అమృత్ సరోవర్‌తో భూగర్భజలాల పెంపు



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం: ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న అమృత్ సరోవర్‌లో భాగంగా నీటి కుంటలు తవ్వడం వల్ల భూగర్భజలాలు పెంపొందుతాయని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. శనివారం గంగమాంబపురం పంచాయతీల్లో జరుగుతున్న అమృత్ సరోవర్‌లో చెరువులో చేస్తున్న నీటి కుంట పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉపాధిహామీ కూలీలతో ఆయన మాట్లాడుతూ అమృత్ సరోవర్‌లో భాగంగా నీటి కుంటలు తవ్వడం వల్ల ఆ మట్టిని రైతుల భూమిలో చల్లుకుంటే భూసారం పెరుగుతుందన్నారు. ఆ భూముల్లో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. మేట్లు పనులు చేస్తున్న కూలీల ఫొటోలను రెండుపూటలా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అప్పుడే వారికి సక్రమంగా బిల్లులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ బాల, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

## బహిరంగ మల, మూత్ర విసర్జనతో రోగాలు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కార్వేటినగరం: బహిరంగ మల, మూత్ర విసర్జన చేసి రోగాల బారిన పడొద్దని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ధనుంజయరెడ్డి అన్నారు. మండల పరిధిలోని సుద్దగుంట గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా రెండవ రోజు శనివారం 50 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్థానిక పాఠశాల పరిసరాల్లో విస్తృతంగా పిచ్చిమొక్కలు, ముళ్లకంపలను తొలగించి పారిశుద్ధ్యాన్ని మెరుగు చేశారు. అలాగే ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు పీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో యోగా, ధ్యాన ముద్ర పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ బహిరంగ మల, మూత్ర విసర్జన చేయడం వల్ల ప్రజలు రోగాల బారిన పడే అవకాశం మెండుగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆరోగ్యసూత్రాలతో కూడిన ప్లకార్డులతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి, అధ్యాపకులు డాక్టర్ వెంకటేశన్ హెచ్ఎంలు న్యామతుల్లా, గ్రామ యువత పలువురు పాల్గొన్నారు.

## మహిళా ఆర్థిక సాధికారతకు తోడ్పాటు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్

పాలసముద్రం: సంక్షేమ పథకాలతో మహిళలు ఆర్థిక సాధికారిత సాధించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, వైఎస్సార్ ఆసరాను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ తెలిపారు. పాలసముద్రంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం ప్రారంభోత్సవం సందర్భంగా డ్వాక్రా మహిళలతో సర్పంచ్ అయ్యప్ప, ఎంపీటీసీ గోవిందరాజులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాల అమలులో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. వైఎస్సార్ ఆసరా పథకం అమలుతో మహిళలకు ఆర్థిక స్వేచ్ఛను అందించారన్నారు. కార్యక్రమంలో సంఘమిత్ర మురగయ్య, రిటైర్డ్ హెచ్ఎం రాజామణి, గోపాల్, మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పరిశీలన

నగరి: పట్టణ పరిధిలోని నగరి మెయిన్, కేజీ కుప్పం, కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ శ్రీదేవి తనిఖీ చేశారు. కేజీ కుప్పం పాఠశాలలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు, వర్కింగ్ స్కిల్స్, నోబ్యాగ్‌డే కార్యక్రమాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు జి.లక్ష్మీనారాయణను ప్రశంసించారు. కృష్ణాపురం పాఠశాలలో నాడు–నేడు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఉపాధ్యాయులు సంగీత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె.తిరుమలేశన్‌కు ఆదేశాలు జారీచేశారు. నగరి మెయిన్ పాఠశాలలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

### వైఎస్సార్ బీమా సాయం అందజేత

కార్వేటినగరం: మండల పరిధిలోని సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన పీ.సుగుణ(44) గత కొనేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 19వ తేదీ మృతి చెందింది. దీంతో వైఎస్సార్ బీమా పథకం నుంచి తక్షణ సహాయం కింద శనివారం వారి కుటుంబానికి రూ.10 వేలు నగదును సర్పంచ్ మంగమ్మ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి వైఎస్సార్ బీమాను అందించి రాష్ట్రప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి కింద మరో రూ.90 వేలు త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నందిని, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పోషకాహార ప్రదర్శన

పుత్తూరు రూరల్: తల్లుల అవగాహన నిమిత్తం పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా శనివారం పుత్తూరు మండలం కేబీఆర్‌పురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రోజారమణి మాట్లాడుతూ చిరుధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు ప్రతినిత్యం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని తెలిపారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి చిరుధాన్యాల్లో మంచి పోషకాలు ఉన్నాయన్నారు. పిల్లలు ఈ ఆహారంపై మక్కువ చూపించే విధంగా తల్లులు శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు సైతం చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలతో వంటల తయారీ విధానాన్ని తెలియజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృష్ణవేణి, పాఠశాల హెచ్ఎం గీతాదేవి, టీచర్లు ఉమా మహేశ్వరి, గీత, హేమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్ పద్మ, ఏఎన్ఎం శారద, ఆశావర్కర్ కన్నెమ్మ పాల్గొన్నారు.